بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نحمدہٗ ونصلی علیٰ رسولہ الکریم    وعلیٰ عبدہ المسیح الموعود

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih vth 23.09.2016 (Telugu)**

**క్షమాపణ ఉత్తమ ఆదర్శము ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవితములో కనిపించును. వారు క్షమించిన ఉదాహరణలు ఎన్నో యున్నాయి. వారెంత గొప్పగా క్షమించినారనగా మానవుడు ఆశ్చర్యమునకు గురగును.**

*హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 23.09.2016 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్, లండన్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక సందర్భమున నిజమైన విశ్వాసి లక్షణమును తెలుపుచు తనకు ఇష్టపడిన దానినే ఇతరులకు ఇష్టపడు వ్యక్తియే నిజమైన విశ్వాసి అని తెలిపిరి. ఇదొక ఆదర్శవంతమైన సూత్రము. ఇది ప్రపంచములో ప్రతి స్థాయి అనగా గృహము నుండి అంతర్జాతీయ స్థాయి వరకు ఆప్యాయత, సంధికి పునాది వేయును. వివాదములను అంతమొందించి మనసులలో మృదత్వమును పుట్టించును. పరస్పరం హక్కులను చెల్లించు వైపు దృష్టి మరల్చును. నేను అనేక సందర్భాలలో ఈ విషయమును ఇతరులకు తెలుపగా వారు చాలా ప్రభావితమైతారు. మంచి మాటలు చెప్పి ప్రజలను ప్రభావితం చేయుట మాత్రమే మన పని కాదు. తమ ఆచరణతో ప్రతి విషయమును, ఇస్లాం ప్రతి ఆదేశ అందమును నిరూపించవలెను. సరే మంచి విషయమే కాని మీలో ఎందరు ఆచరించుచున్నారని ప్రజలు మనతో ప్రశ్నించవచ్చును. సందర్భము వచ్చినప్పుడు స్వార్థమును చూపరు. చెప్పే వ్యక్తి ఆచరించినప్పుడే విషయములోని అందము బహిర్గతమగును. మన మాటలు, కర్మలు ఒకే విధముగా యున్నప్పుడే మన విశిష్టతలు ప్రజలకు తెలియును. ప్రజలు కేవలం వినరు, మనందరిని గమనింతురు కూడ.

మనము ధర్మము పేరున గొప్ప ప్రవర్తనల గురించి మాట్లాడినప్పుడు ఇతరులు మన కర్మలు ఎలా యున్నాయో చూచెదరు. విశ్వాసుడు గొప్ప ప్రవర్తనలను స్థాపించు విషయము గురించి ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మీలో గొప్ప ప్రవర్తనలు యున్నప్పుడే మీరు నిజమైన విశ్వాసులని తెలియునని తెలిపిరి. ఒకరి పట్ల మరొకరి మీ మనోభావాలు, భావాలు గొప్ప ప్రమాణములో యుండును. ఆ ప్రమాణములు ఏమిటనగా మీరు తమ కొరకు ఆశించునదే ఇతరుల కొరకు ఆశించుము. తమ హక్కులు పొందుటకు న్యాయము, న్యాయమని నినదించి ఇతరుల హక్కుల విషయములో ప్రతికూల వైఖరి చూపడం మంచిది కాదు.

మన హక్కులు తీసుకొనుటకు మనము ఆందోళన చెందినట్లే ఇతరుల హక్కులు చెల్లించుటకు కూడ అదే ప్రమాణమును స్థాపించుకోవలెను. మనతో తప్పు జరిగినప్పుడు క్షమించాలని, మనతో అగడకూడదని, మనకు శిక్ష పడకూడదని కోరుకున్నప్పుడు ఇతరులు తప్పు చేసినప్పుడు ఫలితముగా మనము ప్రభావితమైనచో వారు అలవాటు పడిన నేరస్తులు కానిచో, తప్పులు పదే పదే చేయనిచో మనము కూడ క్షమించవలెను. కాని ఒకరి తప్పు వలన జమాఅత్ లేదా జాతి ప్రయోజనములకు నష్టము వాటిల్లినప్పుడు ఇది వ్యక్తిగత తప్పిదమనబడదు. అతని నేరము కూడ జాతి నేరమగును. కనుక ఇటువంటి వ్యక్తుల గురించి తీర్పు సంస్థలు చేయును, వ్యక్తి చేయలేదు.

నేను తెలుపనదేమనగా సమాజములోని రోజువారీ పరస్పర సమస్యలలో మన హక్కు అని భావించినది ఇతరులకు ఇచ్చుచున్నామా లేదా. ఇచ్చే ఆలోచన మనకు యున్నదా లేదా. ఇందులో మొదటి పరిధి గృహమే. మరల మిత్రులు, సోదరులు సోదరీమణులు లేదా ఇతర బంధువులున్నారు. చిన్న స్థాయిలో, తమ కంటే క్రింది వారి పట్ల ఈ ఆలోచన యున్నప్పుడు సమాజములో కూడ విశాలమైనప్పుడు ఇదే ఆలోచన యుండును. స్వార్థములు అంతమగును. హక్కులు చెల్లించు విషయములు అధికమగును. క్షమించు ధోరణులు పెరుగును. శిక్షించు లేదా శిక్ష ఇప్పించు వైపు దృష్టి తగ్గును. బాహ్య హక్కులు, అవసరములను గమనించుటతో పాటు క్షమించు వైపు కూడ

దృష్టి యుండవలెనని పవిత్ర ఖుర్ఆన్‌లో గలదు. అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో ఇట్లు తెలిపెను.
الَّذِينَ يُنفِقُونَ فِي السَّرَّاءِ وَالضَّرَّاءِ وَالْكَاظِمِينَ الْغَيْظَ وَالْعَافِينَ عَنِ النَّاسِ ۗ وَاللَّهُ يُحِبُّ الْمُحْسِنِينَ ○ (ఆలె ఇమ్రాన్:135) అనగా సంపన్నులైనను, దారిద్రమున్నను వినియోగించువారు, తమ కోపమును నిగ్రహించుకొను వారు, ఇతరులను క్షమించువారు, సత్కార్యములు చేయువారిని అల్లాహ్ ప్రేమించును.

అవసరమున్న దాసుల హక్కు చెల్లించుటకు వినియోగించు విషయమును ఇందులో అల్లాహ్ తఆలా మొదటగా సూచించెను. అనంతరం అల్లాహ్ తఆలా ఇట్లు తెలిపెను. సత్కార్యములు చేయువారి మరో లక్షణము ఏమనగా వారు తమ భావాలను అదుపులో యుంచుకొందురు. ఇదొక సాధారణ విషయము కాదు. అన్ని రకాల కోపము, ప్రతీకార భావములను మనసులో నుండి తీసివేయుట చాలా పెద్ద విషయము. కోపము కూడ రాకూడదు, ప్రతీకారము తీసుకొను భావములు కూడ మనసులో నుండి తొలగిపోవుట, కోప భావాలను తీసివేయుటయే కాక తప్పు చేసిన వ్యక్తిపై ఉపకారము చేయుట సాధారణ విషయము కాదు. ఇది చాలా పెద్ద విషయము. ఈ విషయములు విశ్వాసిలో ఏర్పడాలని అల్లాహ్ తఆలా ఆశించును. చరిత్ర పుటల్లో హజ్రత్ ఇమామ్ హసన్ (రజి.) ఒక సంఘటన ఇట్లు గలదు. వారి ఒక బానిసతో ఏదో ఒక తప్పు జరగగా వారికి కోపము వచ్చెను. శిక్షించుటకు సిద్ధమగుచుండగానే ఆ బానిస ఒక సూక్తిలోని ఈ భాగము وَالْكَاظِمِينَ الْغَيْظَ చదివెను. అనగా వారు కోపమును నిగ్రహించుకొందురు. కనుక శిక్షించుటకు లేపిన చేతిని హజ్రత్ హసన్ (రజి.) క్రిందికి దింపిరి. వెంటనే బానిస وَالْعَافِينَ عَنِ النَّاسِ ఇటువంటి వ్యక్తులు ప్రజలను క్షమింతురని అనెను. అల్లాహ్ తఆలా ఈ ఆదేశము ప్రకారము నేను క్షమించుచున్నానని హజ్రత్ హసన్ రజి. అనిరి. ఆ తరువాత బానిస وَاللَّهُ يُحِبُّ الْمُحْسِنِينَ ○ అనగా ఉపకారము చేయువారిని అల్లాహ్ తఆలా ఇష్టపడునని అనెను. నేను నీకు స్వాతంత్ర్యము ప్రసాదించుచున్నాను. నీకిష్టమున్న చోటకి నీవు వెళ్లిపోవచ్చునని ఆ బానిసతో వారనిరి.

అల్లాహ్ తఆలా ప్రేమ పొందాలని ఆశించువారు ఇతరుల తప్పులు, పొరపాట్లను క్షమించుటయే కాక వారిపై ఉపకారము కూడ చేయుదురు. ఈ సూక్తి అనుసారము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి.

"కఠినత్వము చూపువాడు, కోపమునకు గురయ్యేవాని నాలుకపై విజ్ఞానములు, వివేకముతో కూడిన మాటలు రానే రావు. తన ఎదుటి వ్యక్తిపై వెంటనే కోపమునకు గురై అదుపు తప్పేవాని హృయదము విజ్ఞానములను కోల్పోవును. అసభ్య నోరు, అదుపుతప్పిన పెదవులు వివేకముల చెలిమల నుండి దూరము చేయబడును. కోపము వివేకము ఒక చోట చేరలేవు. కోపమునకు గురయ్యే వ్యక్తి మెదడు మొందుబారును, ఆలోచన శక్తి కోల్పోవును. కోపము అర్ధ పిచ్చితనముతో సమానము. ఇది ఉద్రేకించినప్పుడు పూర్తి పిచ్చితనముగా మారును. మెదడు, ఉద్రేకములో భయంకరమైన శత్రుత్వము గలదు. ఉద్రేకము, కోపము వచ్చినప్పుడు వివేకము నిలువదు. ఓర్పు, సహన ఉదాహరణ చూపువానికి ఒక కాంతి బహుకరించబడును. తద్వారా అతని వివేకము, ఆలోచన శక్తులలో ఒక క్రొత్త కాంతి పుట్టును. అనంతరం కాంతితో కాంతి పుట్టను. కోపము, ఉద్రేక స్థితిలో హృదయము, మెదడులో అంధకారము ఏర్పడును. కనుక అంధకారముతో అంధకారము పుట్టను.

కొన్ని చోట్ల కఠినముగా వ్యవహరించవలసి వచ్చును. కాని కోపమునకు గురై కఠినముగా వ్యవహరించుట సమంజసము కాదు. ఇస్లాంలో శిక్షల పరంపర యున్నది. కాని ఇందుకు కొన్ని నియమ నిబంధనలు గలవు. కోపమునకు గురై శిక్షించుట వివేకము, న్యాయము నుండి దూరము చేయును.

కోపమును నిగ్రహించుకొన్న తరువాత క్షమించుచు పోవాలని వివేకరహితముగా అల్లాహ్ తఆలా చెప్పలేదు. క్షమాపణ, శిక్షకు గల వేవకమును చెప్పి తీర్మానించాలని చెప్పెను. అల్లాహ్ తఆలా ఇట్లనెను.
وَجَزَاءُ سَيِّئَةٍ سَيِّئَةٌ مِّثْلُهَا فَمَنْ عَفَا وَأَصْلَحَ فَأَجْرُهُ عَلَى اللَّهِ إِنَّهُ لَا يُحِبُّ الظَّالِمِينَ (అష్షూరా:41) అనగా చెడుకు ప్రతీకారం చేయబడిన చెడుకు సమానముండును. తప్పులను దిద్దుకొనువాడైనచో, ఎవడేని క్షమించినచో, దాని ప్రతి ఫలము అల్లాహ్ బాధ్యత. నిశ్చయముగా అతడు అన్యాయవర్తులను ఇష్టపడడు.

నేరస్తునికి అతని నేరము గురించి ఆలోచన కలిగించి సంస్కరించుటయే అసలు ఉద్దేశము. ప్రతీకారము

తీర్చుకొనుట, వాజ్యములలో ఇరికించుట, తన ధనమును వృధా చేయుట, ఇతరుల ధనము వృధా చేయుట ముఖ్యము కాదు. తన సమయమును కూడ వృధా చేయుట ఇతరుల సమయమును కూడ వృధా చేయుట, జమాఅత్ సంస్థల విషయమైనచో వాటి గురించి అపోహ కలిగించుకొనుట కాదు. క్షమించినప్పుడు సంస్కరణ జరిగే అవకాశమున్నచో క్షమించుట మంచిదే. సంస్కరణకు శిక్షించుట అనివార్యమైనచో శిక్షించవలెను. కాని సంబంధిత సంస్థలకు విషయమును చేరదీయవలెను. ఈ వివేకము గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనేక చోట్ల వ్రాసినారు.

వారొక చోట ఇట్లు తెలిపిరి. న్యాయమైన చట్టము ప్రకారము ప్రతి ఒక్క పాపమునకు అంతే శిక్ష పడును. కాని క్షమించినచో నేరస్తుని సంస్కరణ జరిగే అవకాశమున్నచో, అతడు నేరములపై ధైర్యము పొంది మరింత విచ్చలవిడిగా చేసే అవకాశము లేనిచో ఒక వ్యక్తి తమకు నష్టము కలిగించిన వానిని క్షమించవలెను, అల్లాహ్ తఆలా అతనికి గొప్ప ప్రతిఫలము నొసంగును.

నేరస్తుడు ఇక ముందు నేరమునకు పాల్పడదని కనిపించినచో క్షమాపణ, క్షమించుట మంచిదే. కొందరు కరుడ్డుగట్టిన నేరస్తులుందురు. ప్రతి సారి నేరము చేసి క్షమాపణ కోరుతారు. ఇటువంటి వారిని శిక్షించుట అనివార్యము. అతని సంస్కరణ జరిగే విధముగా శిక్షించవలెను.

ఇది ఇస్లామీ శిక్ష, క్షమాపణలో గల వివేకము. ఇందులో సంస్కరణ ఉద్దేశము యుండవలెను. కనులు మూసుకొని ప్రతి ఒక్కరిని క్షించాలని అల్లాహ్ తఆలా ఉద్దేశము కాదు. కోపమునకు గురై శిక్షించుట వైపు మాత్రమే దృష్టి యుండకూడదు. క్షమించుచుపోయినచో సమాజము చెడిపోవును. శిక్షించుచు పోయినచో కూడ కోపములు, కుట్రలు పెరుగును. సమాజములో ద్వేషముల గోడలు నిలుచును. అశాంతి చెలరేగును.

ఏది ఏమైనప్పటికి ఇది ఇస్లాం ఒక బోధన. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎంత వరకు క్షమించేవారో ఇప్పుడు మనము పరిశీలిద్దాం. క్షమాపణ ఉత్తమ ఆదర్శము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవితములో కనిపించును. శిక్ష పడునని తీర్పు జరిగిన వారిని కూడ వారు సల్లల్లాహు అలైహి వసల్లం క్షమించి వేసిరి. తమకు నష్టము కలిగించిన, తమ సంతానమును హతమార్చినవారిని క్షమించిరి. ఎందుకనగా వారి సంస్కరణ జరిగియుండెను. చరిత్ర పుటలలో ఒక సంఘటన ఇట్లు గలదు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కుమార్తె హజ్రత్ జైనబ్ రజి. మక్కా నుండి మదీనా వైపు ప్రస్థానము చేయుచుండగా ఒక వ్యక్తి హబ్బార్ బిన్ అస్వద్ వారిని హత్య చేయుటకు దాడి చేసెను. అప్పుడు వారు గర్భవతిగా యుండిరి. దాడి వలన వారి గర్భము కూడ పడిపోయెను. గాయపడిరి కూడ. అనంతరం అదే గాయము వలన వారు మరణించిరి. ఈ నేరము వలన హబ్బార్‌ను హతమార్చాలని నిర్ణయము తీసుకోబడెను. మక్కా విజయము సందర్భమున ఈ వ్యక్తి పారిపోయి ఎక్కడికో వెళ్లిపోయెను. నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం మదీనా చేరుకున్న తరువాత హబ్బార్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సేవలో హాజరై ఇట్లు వేడుకొనెను. కరుణించాలని యాచించుచున్నాను. మొదట నేను మీతో భయపడి పారిపోయియుంటిని. కాని మీ కరుణ, దయ నన్ను తిరిగి తీసుకొచ్చెను. ఓ దైవ సందేశహరుడా! మేము మూర్ఖులుగా యుంటిమి, అన్యారాధకులుగా యుంటిమి. మీ ద్వారా అల్లాహ్ తఆలా మాకు మార్గదర్శనము చూపెను. వినాశనము నుండి రక్షించెను. నేను నా నేరములను అంగీకరించుచున్నాను. నా మూర్ఖత్వమును విస్మరించి నన్ను క్షమించగలరు. తమ కెమార్తె హంతకున్ని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం క్షమించి, ఇట్లనిరి. సరే ఓ హబ్బార్! నేను నిన్ను క్షమించినాను. అతడు మిమ్ములను ఇస్లాం స్వీకరించేందుకు అనుగ్రహించి మీపై ఉపకారము చేసెను. సంస్కరణ జరిగినదని చూచి వారు తమ కుమార్తె హంతకున్ని కూడ క్షమించిరి.

హజ్రత్ ఆయిషా (రజి.) ఇట్లు తెలిపిరి. తనపై జరిగిన దౌర్జన్యమునకు ఎన్నడు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రతీకారము తీసుకోలేదు. అందుకే ఆహారములో విషము కలిపి తినిపించిన యూదురాలిని క్షమించిరి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం చిన్నాన్న హజ్రత్ హంజ రజి. శవమును ముస్ల చేసిన (అవమానించిన) హిందను కూడ క్షమించిరి. వారు క్షమించినందున ఆమె జీవితమే మారిపోయెను. వారెంతో వినమ్రురాలిగా మారిరి. అదే రోజు సాయంత్రం ఆమె ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు విందు ఇచ్చి, రెండు గొఱ్ఱెపిల్లలను

వేంచి పంపి ఇట్లనెను. ఈ రోజులలో పశువులు తక్కువ వున్నందున చిన్న కానుక స్వీకరించగలరు. ఓ అల్లాహ్! హింద్ మందలో చాలా శుభము కలిగించునని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రార్థన చేసిరి. ఈ ప్రార్థన ఫలితముగా ఎంత శుభము కలిగినదనగా ఆమె మందను అదుపు చేయడం కష్టమయ్యెను.

అబ్దుల్లాహ్ బిన్ అబీ బిన్ సులూల్ మొత్తం అవమానములను క్షమించి, అతని అంత్యక్రియ ప్రార్థన కూడ చదివించిరి. కాబ్ బిన్ జహీర్ ఒక ప్రఖ్యాత కవి జరిగిరి. కొన్ని విషయముల వలన అతన్ని కూడ హతమార్చాలని తీర్మానము జరిగెను. మక్కా విజయము తరువాత అతని సోదరుడు వచ్చి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో క్షమాపణ యాచించమని అతనికి ఉత్తరము వ్రాసెను. వారు మదీనా వచ్చి తనకు పరిచయం యున్న వ్యక్తి వద్ద బసచేసిరి. ఫజర్ నమాజ్ ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వెనుక సలిపెను. నమాజ్ తరువాత ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సేవలో ఓ రసూలుల్లాహ్! కాబ్ బిన్ జహీర్ పశ్చత్తాపముతో వచ్చి క్షమాపణ కోరుచున్నాడని అనిరి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అతన్ని గతములో చూడనందుకు గుర్తు పట్టలేకపోయిరి. అనుమతి ఇచ్చినచో అతను మీ ముందు ప్రవేశపెట్టబడును. సరే రమ్మనమని వారనిరి. ఓ రసూలుల్లాహ్! కాబ్ బిన్ జహీర్ నేనేనని అతడనెను. వెంటనే ఒక అన్సారి అతన్ని హతమార్చుటకు నిలబడిరి. ఇతను క్షమాపణ కోరుచు వచ్చినాడు. కనుక ఇతన్ని విడిచిపెట్టమని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనిరి. అనంతరం అతడు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సేవలో ఒక ఖసీదహ్ (ప్రశంస పద్యము) వినిపించెను. అందుకు వారు ఆనందము వ్యక్తపరచుచు తన చద్దరు కూడ అతనికి బహుకరించిరి. వారి క్షమించు ప్రామాణికము ఇట్లుండెను. క్షమించడమే కాక బహుమానమిచ్చి, దీవించి పంపేవారు. వారు క్షమించిన ఉదాహరణలు ఎన్నో యున్నాయి. వారెంత గొప్పగా క్షమించినారనగా మానవుడు ఆశ్చర్యమునకు గురగును.

ఒక సారి ఒక వ్యక్తి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సేవలో హాజరై ఇట్లు వేడుకొనెను. నాకు గల ఒక బానిస పొరపాట్లు చేయుచున్నాడు. నేను అతన్ని శారీరకంగా శిక్షించవచ్చునా. ప్రతి రోజు అతన్ని 70 సార్లు క్షమించుమని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అతనితో అనిరి. అనగా చాలా అధికముగా విస్మరించుము.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. జమాఅత్ సిద్ధము చేయు ఉద్దేశమేమనగా నాలుక, చెవులు, కనులు, ప్రతి అవయవము దైవభక్తితో నిండవలెను. దైవభక్తి కాంతి అతని లోపల బయట యుండవలెను. సద్గుణములకు గొప్ప ఉదాహరణ కావలెను. అనవసరముగా కోపము ఏ మాత్రం యుండకూడదు. కోపము గల లోపములో జమాఅత్‌లోని అధికులు ఇప్పటికి యున్నట్లు నేను చూచితిని. చిన్న చిన్న విషయములలో కోపము, ద్వేషమునకు గురై పరస్పరం జగడమాడుతారు. ఇటువంటి వారికి జమాఅత్‌లో ఎలాంటి భాగము లేదు. ఎవరైనా దూషించినచో ఎదుటి వ్యక్తి మౌనము పాటించి అతనికి సమాధానము ఇవ్వకుండా యుండుటలో ఇబ్బంది ఏమిటో నాకు అర్థం కాదు. ప్రతి జమాఅత్ సంస్కరణ మొదటగా సత్ప్రవర్తనలతో మొదలగును. ఆరంభములో ఓర్పుతో శిక్షణలో ప్రగతి చెందవలెను. ఎవరైనా దూషించినచో అతని కొరకు హృదయపూర్వకముగా దుఆ చేయవలెను. ఈ ప్రామాణికములను పొందుటకు అల్లాహ్ తఆలా మనందరిని అనుగ్రహించుగాక! (ఆమీన్)

☆ ☆ ☆

BOOK POST (PRINTED MATTER)

To,

........................................................................

........................................................................

........................................................................